# కథ

**"మనిషంతటి స్వార్థజీవి సృష్టిలో మరొకటి కనపడదు. అన్నీ తనకే కావాలి. తన వాళ్ళే సుఖంగా ఉండాలన్న స్వార్థం ఒక్కోసారి మానవత్వాన్ని, విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయేలా చేస్తుంది. కాదంటారా మిస్టర్ భాస్కర్" డాక్టర్ అభిరాం గొంతులో ఆవేదన!**

# మానవత్వం పరిమళించిన వేళ....

చిన్నగా నవ్వుతూ అభిరామ్ కళ్ళల్లోకి లోతుగా ఏదో వెతుకున్నట్లు చూసాడు భాస్కర్.

ఒక విధమైన ప్రశాంతతతో మెరుస్తున్న కళ్ళు, మాటల్లో ఉన్నతమైన వ్యక్తిత్వం, మనిషిలో హుందాతనం.

''చేతికి ఎముకే లేని మీరు స్వార్థం అన్న పదం ఉచ్ఛరించటమే చిత్రంగా! పేదలకోసం హాస్పిటల్స్ కట్టించి ఉచితంగా వైద్యం చేస్తున్న మీరు, మీ చల్లని మనసు, అందుకే పద్మశ్రీ అవార్డు మిమ్మల్ని వరించింది, కాదు మిమ్మల్ని వరించినందుకు ఆ అవార్డే గర్విస్తుంది.''

''ఆపండి భాస్కర్. ఎందుకీ పొగడ్తల హారాలు? ఒకప్పుడు నేను డబ్బు మనిషిని, స్వార్థపరుడ్ని. డబ్బుమీది వ్యామోహం నాలోని మానవత్వాన్ని నశింపజేసింది. నేనిలా మారటానికి కారణమైన మహోన్నత మానవతా మూర్తిని జన్మలో మరిచిపోలేను. పూటకి గతిలేని వాడైనా నన్ను నిలువునా కదిలించి, నా కళ్ళు తెరిపించిన దేవుడతడు. నాలో స్వార్థాన్ని కూకటివేళ్ళతో పెకలించిన కరుణామయుడు'' అతని కళ్ళ నుండి రెండు కన్నీటిబొట్లు మనసు పడే వేదనకు సాక్ష్యంగా!

వృత్తిలో ఉన్నప్పుడు గంభీరంగా, హుందాగా వ్యవహరిస్తూ, స్నేహితులతో ఎప్పుడూ జోక్సు వేసి నవ్వుతూ నవ్విస్తూ సరదాగా, చలాకీగా గడిపే ఈ డాక్టరేనా ఈవేళ ఇంతలా మానసికంగా కదిలిపోయేది. ఆయనకీ అవార్డు వచ్చినందుకు తోటి డాక్టరుగా ఒక మంచి ఫ్రెండుగా మనస్ఫూర్తిగా అభినందించడానికి వచ్చిన తనని ఇక్కడి వాతావరణం ఇలా.. కళ్ళు చెమర్చేలా...

ఇన్నాళ్ళుగా హృదయంలో గూడుకట్టుకున్న విషాదమంతా ద్రవీభవించి కన్నీరై కాల్వలు కడుతున్న సెన్సిటివ్‌నెస్‌ని మొదటిసారిగా చూస్తున్న భాస్కర్‌కి ఒక క్షణం అతనో అపరిచిత వ్యక్తిలా అనిపించాడు.

అతని రెండు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ ''ఊర్కోండి అభిరాం! ప్లీజ్ కంట్రోల్ యువర్‌సెల్ఫ్. వ్వాట్ హేపెండ్ టు యూ?'' అడిగిన ప్రశ్నలో ఉత్సుకతతోపాటు ఓదార్పు కూడా!

స్నేహితుని మాటల్లో ఊరడింపుతో, చేతి స్పర్శలోని ఆత్మీయతతో కొంత సర్దుకున్నాడు.

''అయామ్ సారీ! మీ టైము వేస్టు చేస్తున్నట్టున్నాను''

''అబ్బే! అదేం లేదు. చెప్పండి. గతంలో మీకు ఎదురైన విషాద సంఘటన మిమ్మల్ని ఇంతటి మానవతావాదిగా మార్చేసిన ఆ మహోన్నత వ్యక్తిని గురించి తెలుసుకోవాలనుంది'' ఉత్సాహంగా ముందుకి వంగాడు భాస్కర్.

కళ్ళు గతాన్ని వెతుకుతున్నట్టు ఎక్కడో చూస్తున్నాయి. మనసు మాటల్ని కూడదీసుకుంటూ జ్ఞాపకాల్ని వెల్లడించే పనిలో పడింది.

★ ★ ★

అవి నేను డాక్టరుగా ప్రాక్టీసు ప్రారంభించి ఆర్థికంగా నిలదొక్కుకోడానికి ప్రయత్నం చేసే రోజులు.

పొద్దున్న ఏడు గంటలకి క్లినిక్ తెరిచి పదకొండు దాకా పేషంట్లతో బిజీగా ఉండేవాడ్ని.

చిత్రంగా ఆరోజు తొమ్మిదిన్నర అయినా ఒక్క పేషంటూ రాలేదు. శీతాకాలపు లేత ఎండ రాత్రంతా కురిసిన మంచుని కరిగించలేదింకా.

ఇక్కడెందుకూ వణుక్కుంటూ కూర్చోటం? ఇంటికెళ్లి భార్యతో వెచ్చగా కబుర్లాడుకుంటూ కాలక్షేపం చెయ్యాలన్న కోరిక. పైగా ఆరోజు ప్రత్యేకత మా మ్యారేజ్ డే.

క్లినిక్ షట్టర్ దించిన నాకు ఎదురుగా ఒక రిక్షా వచ్చి ఆగటం కనిపించింది.

''బాబూ! యాక్సిడెంట్ అయ్యి తలమీంచి రక్తం బాగా పోతోంది. కాపాండదయ్యా'' చేతులు జోడించి ప్రాధేయపడుతున్నాడు రిక్షా వాడు.

షట్టర్ లాక్ చేస్తూ గమనించాను. రిక్షాలో ఉన్న వ్యక్తి గొంగళి కప్పుకుని అటు వైపు తిరిగి పడుకున్నాడు. స్పృహ లేనట్లుంది.

యాక్సిడెంటు అనగానే కొద్దిగా జంకాను. పోలీసు కేసులూ, కోర్టుల చుట్టూ తిరగటాలూ కళ్ళ ముందు కదలాడి కర్తవ్య విమూఢుణ్ణి చేశాయి. పైగా ఇదేమీ డబ్బొచ్చే కేసూ కాదు. ఖరీదైన మందులకీ, సెలేను బాటిల్సుకీ స్టిచ్చింగులకీ చాలా ఖర్చవుతుంది.

ఈ రిక్షా వాడు వాటిని ఎలాగూ భరించలేడు. ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ- ''నావల్లకాదు వెళ్ళవయ్యా. ఏదైనా పెద్దాస్పిటల్లో చూపించు'' అప్పటికే స్కూటరు స్టార్టు చేశాను.

వాడి కళ్ళల్లో నిరాశ!

''అది కాదు బాబూ!'' ఏదో చెప్పటానికి తపటపటాయిస్తూ నీళ్ళు నములుతూ ముందుకు రాబోతున్న వాడి కదలికల్ని ''ఏమిటి చెప్పు'' అన్నట్లు నిర్లక్ష్యంగా విసుగ్గా చూసిన నా చూపు ఆగిపోయేలా చేసింది.

''తమరు పెద్దాసుపత్రిదాకా తోడొచ్చి సూపిస్తే..''

వాడి మాట పూర్తికాకుండానే తలెగరేసి ఛీత్కారంగా చూసి స్కూటర్‌పై రివ్వున దూసుకుపోయాను.

వసంతకి మ్యారేజ్ డే గిఫ్టుగా దారిలో ఓ బంగారు గొలుసు కొన్నాను. అది ఆమె మెడలో అలంకరించేటప్పుడు ఆ కళ్ళల్లో మెరుపునీ, పెదవులపై కదలాడే దరహాస రేఖలన్నీ ఊహించుకుంటూ ఇల్లు చేరాను.

ఆమె రెడీ అయి గుప్పిట్లో ఏదో దాచుకుని నాకోసం ఎదురుచూస్తూ సోఫాలో కూర్చుంది.

చప్పుడు చేయకుండా వెనక నుంచీ వెళ్ళి ఆమె కళ్ళు మూసాను. ఆమె నా చేతుల్ని తడుముతూ అందమైన ముత్యపు ఉంగరాన్ని వేలికి తొడిగి నన్ను ఆశ్చర్యంలో ముంచింది.

నేనూ నా బహుమతిని అందించి ఆ కళ్ళల్లో కోటి పున్నముల వెలుగుని ఆస్వాదించాను.

''త్వరగా పద. ఏదైనా హోటల్‌కెళ్లి అట్నుంచి సినిమాకెళ్దాం. అన్నట్టు కళ్యాణ్ ఏడీ?''

''వాడు. రాడటండీ...ఈరోజు క్విజ్ కాంపిటేషన్ ఉందని స్కూలుకెళ్ళాడు. వాడొస్తే ఇమ్మని పక్కింట్లో తాళం చెవి ఇద్దాం లెండి'' ఇల్లు తాళం వేస్తూ చెప్పింది వసంత.

★ ★ ★

సినిమాలు, షికార్లూ పూర్తయి సాయంత్రం ఇంటికెళ్ళేసరికి కళ్యాణ్ రాలేదన్న సంగతి తెలియజేస్తూ తలుపునకు తాళం వేళ్ళాడుతోంది.

'స్కూలు విడిచిపెట్టి అప్పటికి రెండు గంటలు దాటింది. వాడేమైనట్టు?' మా ఇద్దరి మొహాల్లో ఆందోళన. కాళ్ళల్లో సన్నటి వణుకు.

బైట వాతావరణం కూడా మా మనసుల్లాగే ఒక్కసారిగా మారిపోయింది. డిప్రెషన్ కాబోలు. ఆకాశం నల్లని దట్టమైన మేఘాల్ని ముసుగేసుకుని కన్నీళ్ళని ధారగా వర్షించడానికి సిద్ధంగా ఉంది.



తాళం తీస్తుండగా ఫోను రింగయిన శబ్దం. ఒక్క ఉదుటున వెళ్ళి అందుకున్నాను. అవతల్నుంచి కళ్యాణ్ స్కూలు ప్రిన్సిపాల్.

''మధ్యాహ్నం నుంచీ ఫోను చేస్తున్నా ఎవ్వరూ ఎత్తటం లేదనీ, కళ్యాణ్‌కి పొద్దున్న యాక్సిడెంటు అయి ఫలానా హాస్పిటల్లో చేర్చారనీ, వాడి బ్యాగులో పుస్తకాలపై ఉన్న స్కూలు పేరు చూసి ఎవరో చెప్తే అప్పట్నుంచీ ఫోను చేస్తూనే ఉన్నామని'' చెప్పాడు.

మనసు మొద్దుబారింది. చేతిలో రిసీవరు బిగుసుకుంది. వెచ్చటి నెత్తురు ఒక్కసారిగా మొహంలోకి వచ్చి ఆవిర్లు చిమ్ముతున్న భావన. గుండె స్పందనలో వేగం గొంతు తడారిపోయి ప్రయత్నించినా నోట మాట రాని పరిస్థితి.

''మాట్లాడరేంటండీ'' నన్ను కుదిపేస్తున్న వసంతని రెక్క పట్టుకుని బైటికి లాక్కొచ్చి స్కూటర్‌పై కూలేసి ఇల్లు లాక్ చేసి స్కూటరెక్కాను.

భోరున ప్రారంభమైన వర్షంలో తడిసి ముద్దవుతూ హాస్పిటల్‌వైపు దూసుకుపోయాం.

★ ★ ★

''మా బాబుకి ఎలా ఉంది డాక్టర్?'' కన్నీళ్ళతో ప్రశ్నించాను.

''మరేం ఫర్లేదు. జాయిన్ అవ్వటం మరి కాస్త లేటయి వుంటే పరిస్థితి విషయమించేది. తలకి బలమైన గాయమై రక్తం చాలా పోయింది. సమయానికి ఆ గ్రూపు బ్లడ్ మా దగ్గర లేదు. ఇక్కడికి తీసుకొచ్చినతనే బ్లడ్ కూడా ఇచ్చి కాపాడాడు.''

''రియల్లీ! అతన్ని నాకు చూపించండి డాక్టర్'' చేతులు పట్టుకుని కన్నీళ్ళతో ప్రాధేయపడ్డాను.

''బాబు వివరాలు తెలిసాయి. తల్లిదండ్రులకి కబురు చేస్తాం అని చెప్పాక 'అలాగా బాబూ! అయితే నేను రేప్పొద్దున్న వస్తాలెండి' అంటూ ఇప్పుడే వెళ్ళిపోయాడు.''

డాక్టరు సమాధానం నన్ను నిరాశ పరుస్తుండగా సిస్టర్ వచ్చి బాబుకి స్పృహ వచ్చిందని చెప్పడంతో అందరం లోపలికెళ్ళాం.

★ ★ ★

కళ్యాణ్‌కి పూర్తిగా నయమయ్యి డిశ్చార్జి చేసేదాకా మేమిద్దరం జీవచ్ఛవాలమే అయ్యాం. వాడికేమైనా జరిగుంటే మేమిద్దరం బ్రతికుండేవాళ్ళమా అసలు? మా ప్రాణంలో ప్రాణం. మా జీవితం మా సర్వస్వం అన్నీ వాడే! వాడే లేని క్షణం మా ఇద్దరి గుండెలూ ఒక్కసారిగా ఆగిపోవూ! 'వాడిని చేర్పించి రక్తం పంచి ఇచ్చిన ఆ ప్రాణదాత ఎవరు? ఆ మర్నాడే వస్తానని రాలేదెందుకో' అని ఎన్నోసార్లు అనుకున్నాను.

**వి. యల్. వి. భారతి**

దాదాపు పదిహేను రోజుల తర్వాత క్లినిక్ తెరిచి లోపలికెళ్ళాను. పేపరు బాయ్ వేసిన న్యూస్ పేపర్లన్నీ షట్టర్ కింద నుంచీ లోపలికి తోయబడి ఉన్నాయి. అవన్నీ బొత్తి పెడుతున్న నా దృష్టి ఒకచోట ఆగిపోయింది.

''రిక్షా కార్మికుడి దుర్మరణం'' అని వుంది పెద్దక్షరాలతో ఫొటోతో సహా!

చిమ్మచీకటిలో వర్షం రాత్రి నీరసంతో రిక్షా

తొక్కుతూ వెళ్తున్న అతను, రిక్షా అదుపు తప్పి ఓ బండ రాయిపై పడి మరణించాడు. రెండు రోజుల్నుంచీ ఆహారం లేక అలమటిస్తూ ఉన్న అతను నీరసంతో కళ్ళు తిరిగి పడి అలా ప్రమాదానికి గురై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారని ఉంది.

అది చదివిన నాలో ఏదో అనుమానం! మనసులో గజిబిజి భావాలు!

ఆరోజే కళ్యాణ్‌ని ట్రీట్ చేసిన డ్యాక్టరుని కలిసి పేపరు చూపించి బాబుని హాస్పిటల్లో చేర్పించినది ఆ రిక్షావాడే అని తెలుసుకున్నాను.

నా గుండెనెవరో మెలితిప్పినంత బాధ!

'అంటే..ఆరోజు..నా క్లినిక్‌కి రిక్షాలో పేషంటుగా వచ్చింది నా కన్న కొడుకేనా? రిక్షావాడి గొంగళి కప్పుకుని అటు తిరిగి పడుకున్నందుకు గుర్తుపట్టలేదు. పైగా రిక్షావాడు నన్ను పెద్దాసుపత్రి దాకా తోడు రమ్మని అర్థించాడే!' నా కన్నీటి ధారలు చేతిలోని న్యూస్ పేపర్ని తడిపేస్తున్నాయి.

నా అంత నిర్దయుడు మరొకడుంటాడా? ఆ రిక్షా వాడికున్నంత మానవత్వం ముందు నేనొక గడ్డిపోచని. ఇది డబ్బొచ్చే కేసు కాదనీ తిరస్కరించాను. పోలీసులూ, కోర్టు కేసులూ అంటూ భయపడ్డాను.

మ్యారేజ్‌డే సరదాగా గడపాలన్న ఆరాటంలో వాడితో కూడా పెద్దాసుపత్రికి వెళ్ళటానికీ నిరాకరించాను. కానీ అతనే తన రక్తాన్ని దానమిచ్చి నా ఇంటి దీపాన్ని నిలబెట్టాడు. కనీసం అతని ఋణం తీర్చుకుందామన్నా ఇప్పుడు అతను ఈ లోకంలో లేడు.


రోజురోజుకీ పెరిగే నా మానసిక వేదనని వసంత అర్థం చేసుకుంది. ఆమె సలహాతో ఇద్దరం మురికివాడ వెళ్ళి ఎంక్వైరీ చేశాం.

ఆ రిక్షావాడికి భార్య లేదనీ, ఐదేళ్ళ కూతురు మాత్రం ఉందనీ ప్రస్తుతం ఆ పిల్ల అనాథగా మారి అడుక్కుతిని బతుకుతోందని తెలిసింది.

ఆ పాపని ఇంటికి తెచ్చుకున్నాం.

క్రమంగా నాకు మంచి హస్తవాసి ఉన్న డ్యాక్టరుగా పేరూ, ఆదాయం వచ్చాయి. ఆ రిక్షావాడు నాలో నాటిన మానవత్వమనే బీజం మొలకెత్తి మహావృక్షమైంది.

నా సంపాదనలో అధిక భాగం ఖర్చు చేసి ఆ రిక్షావాడి పేరుమీదుగా 'రంగా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' ప్రారంభించాను.




ప్రభుత్వం నుంచీ స్వచ్ఛంద సంస్థల నుంచీ ఆర్థిక సహాయం తీసుకుంటూ పేదలకి ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాను.

నా సేవల్ని దేశంలోని ఇతర ప్రాంతాలకీ విస్తరింపజేసాను. ఇందులోనే నేను అంతులేని మానసిక తృప్తినీ, ప్రశాంతతని అనుభవిస్తున్నాను.

అప్పుడప్పుడూ ఆ రిక్షావాడి రూపం, అతను చేసిన త్యాగం కళ్ళల్లో మెదిలి ఆనాటి నా ప్రవర్తన మనసుకి ముల్లై గుచ్చుతూనే ఉంటుంది.

★ ★ ★

సుదీర్ఘమైన గతం చెప్పి కొద్దిసేపు మౌనంగా శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు డాక్టర్ అభిరామ్.

అతని మనసు కుదుట పడేదాక డిస్టర్బ్ చెయ్యాలనిపించలేదు భాస్కర్‌కి. ఆ తర్వాత వాతావరణాన్ని తేలిక పరుస్తూ ప్రశ్నించాడు.

''ఇంతకీ ఆ పాప ఎక్కడుంది ఇప్పుడు''

''హౌస్ సర్జన్ చేస్తోంది''

''వెల్డన్ మిస్టర్ అభిరామ్! యు ఆర్ గ్రేట్. ఒక వేళ ఆ రిక్షావాడే బ్రతికుండి మీ నుండి కొంత ఆర్థిక సాయం పొందినా తన కూతుర్ని ఇంత గొప్పగా తీర్చిదిద్దేవాడు కాదు.



మీ మంచితనం, ఇతరుల కష్టాల్ని చూసి కరిగిపోయే వెన్నలాంటి మనసు, తోటి వారికి చేతనైనంత సహాయం చేసి ఆదుకోవాలన్న తపన, దయాగుణం- ఇవన్నీ మీలో చూస్తుంటే మదర్ థెరిస్సాను తలపింపచేస్తున్నాయి. మీ పరిచయం స్నేహంగా మారినందుకు ఎంతగానో గర్విస్తున్నాను'' సన్నగిల్లిపోతున్న మలి సంధ్యా కాంతిలో అతడి కళ్ళు తడిగా మెరుస్తున్నాయి.

ఇంతకాలం ఎవ్వరికీ చెప్పకుండా తన లోనే దాచుకున్న గతాన్ని చెప్పి గుండె భారాన్ని దింపుకున్నానన్న తృప్తితో చిన్నగా నవ్వుతూ స్నేహితుడి చెయ్యి నొక్కి వదిలిపెట్టాడు డాక్టర్ అభిరామ్.

## కొత్తరూపం

**శ్రీదేవి, కరిష్మాకపూర్ లాగే రవీనాటాండన్ కూడా బుల్లితెరపై తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నట్టుంది. పెళ్లయ్యాక చాలా హోమ్లీగా, స్మార్ట్‌గా కన్పిస్తున్న రవీనా 'సాహెబ్ బీబీ ఔర్ గులాం' సీరియల్ త్వరలో సహారా మనోరంజన్‌లో ప్రసారం కాబోతోంది. 'బెంగాలీ మూసలో కన్పించే ఈ పాత్ర నాకెంతో మంచి పేరు తెస్తుందన్న నమ్మకం నాకుంది. అన్నట్టు ఈ పేరుతో గురుదత్ ఓ సినిమాని నిర్మించారు. ఆ పేరుతోనే వస్తున్న ఈ సీరియల్ కూడా అంత పాపులర్ అవుతుందేమో చూడాలి.**